RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

వరంగల్ | బుధవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260 | దినపత్రిక

సంపుటి: 4 సంచిక:98 | ఏప్రిల్ 01, 2026 | వెల: రూ.3-00



## ఐదు రోజుల పాటు వర్షాలు

పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

వడగళ్ల వాన కురిసే అవకాశం

2లో




## చికెన్ ప్రియులకు షాక్

### నేటి నుంచి దుకాణాలు బంద్

- మార్జిన్ పెంపు డిమాండ్‌తో నిరవధిక ఆందోళన
- రూ.16కి తగ్గిన లాభాలపై వ్యాపారుల ఆగ్రహం
- సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బంద్ కొనసాగింపు

2లో




## ఇల్లంతకుంటలో అసలేం జరుగుతుంది?

### జవార్ వార్ పేటలో జోరుగా ఆన్లైన్ గేమ్స్ దందా

మండలంలో వందలకోట్ల టర్నోవర్ అంటూ ప్రచారం

- బానిసలుగా మారుతున్న యువత
- చేజేతులా భవిష్యత్తు నాశనం
- మేము సైతం అంటున్న ప్రజాప్రతినిధులు
- బినామీ ఖాతాలతో ఊబిలో మరెందరో అమాయకులు
- అప్పుల పాలై చితికిపోతున్న కుటుంబాలు
- ఎవరికీ చెప్పుకోలేక ప్రాణాలు తీసుకుంటున్న వైనం

2లో

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

ఇల్లంతకుంట మండలం జవార్‌పేటలో ఏం జరుగుతోంది..? సరదాగా మొదలైన ఆన్‌లైన్ గేమ్, ఇప్పుడు వందల కోట్ల అక్రమ దందాలా ఎలా మారింది..? సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశతో యువత తమ బంగారు భవిష్యత్తును చితికిపోతున్న ఊబిలోకి నెట్టుకుంటున్నారా..? సామాన్యులే కాదు, రక్షణగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు సైతం ఈ వ్యసనానికి బానిసలై మేము సైతం అంటూ అక్రమ మార్గంలో పయనిస్తున్నారు. బినామీ ఖాతాలు, నకిలీ సిమ్ కార్డులతో సాగుతున్న ఈ మాయాజాలం వెనుక ఉన్న అసలు నిజాలేంటి?

## ఇద్దరు పిల్లలను హతమార్చి.. తల్లి ఆత్మహత్య

- భర్త వివాహేతర సంబంధం కారణంగా కుటుంబంలో కలహాలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- కూకట్‌పల్లిలో ఘోర విషాదం



2లో

## భర్త ఉరివేసుకుని.. భార్య 17వ అంతస్తు పైనుంచి దూకి..

### బెంగళూరులో టెక్కీ దంపతుల ఆత్మహత్య

- మృతులు సిద్దిపేటకు చెందిన వారు
- మానసిక ఒత్తిడి, కుటుంబ సమస్యల కోణంలో పోలీసుల దర్యాప్తు

2లో

## 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- గ్రామ సభల ద్వారా సంక్షేమ పథకాల విస్తరణకు ప్రణాళిక
- ప్రజలు, ప్రభుత్వానికి అనుసంధానంగా అధికారుల సమన్వయం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- జిల్లాల వారీగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

2లో



వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలను చేరవేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో

...మిగతా 2వ పేజీలో



## ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కక్ష సాధింపు

- కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడం సరైంది కాదు
- సీఐడీ నోటీసులపై కౌశిక్ రెడ్డి ఆగ్రహం

వేద న్యూస్, హైదరాబాద్

తనకు సీఐడీ నోటీసులు అందడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతోనే తనపై చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. 'నన్ను లక్ష్యంగా చేసుకుని

...మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

బుధవారం | ఏప్రిల్ 01, 2026

### ఇద్దరు పిల్లలను హతమార్చి..

# తల్లి ఆత్మహత్య

## భర్త వివాహేతర సంబంధం కారణం?

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. భర్త వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న మనస్తాపంతో ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను హతమార్చి, అనంతరం తాను కూడా ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, స్రవంతి (28) అనే మహిళ తన భర్తతో కలిసి నివాసం ఉంటోంది. వీరికి కార్తిక్ (12), కౌశిక్ (8) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా భర్త వేరొక మహిళతో సంబంధం కొనసాగిస్తున్నాడన్న విషయం తెలిసి స్రవంతి తీవ్ర మానసిక వేదనకు గురైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆమె దారుణ నిర్ణయం తీసుకుంది. ముందుగా తన ఇద్దరు కుమారులను హతమార్చి, అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమికంగా కుటుంబ కలహాలు, భర్త వివాహేతర సంబంధమే ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులను విచారించి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు. కన్నతల్లి చేతిలోనే పిల్లలు ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటన కుటుంబ విలువలు, మానసిక ఆరోగ్యంపై ఆలోచింపజేసేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# చికెన్ ప్రియులకు షాక్

## నేటి నుంచి దుకాణాలు బంద్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో రేపటి నుంచి చికెన్ దుకాణాలు నిరవధికంగా బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచే వరకు బంద్ కొనసాగిస్తామని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ ప్రకటించింది. ప్రస్తుతం ఇస్తున్న మార్జిన్ తక్కువగా ఉండటంతో వ్యాపారం నష్టాల్లోకి వెళ్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పౌల్ట్రీ కంపెనీలు రిటైల్ దుకాణాలకు కిలోకు రూ.26 మార్జిన్ ఇచ్చేవని, అయితే ఇటీవల అది రూ.16కు తగ్గించారని వ్యాపారులు తెలిపారు. గత ఇరవై ఏళ్లుగా ఒకే విధమైన మార్జిన్ కొనసాగుతుండగా, అకస్మాత్తుగా తగ్గించడం వల్ల తమపై భారమయ్యిందని పేర్కొన్నారు. కిలోకు కనీసం రూ.30 మార్జిన్ ఇవ్వాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. వ్యాపార నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో తక్కువ మార్జిన్‌తో దుకాణాలు నడపడం కష్టమైందని తెలిపారు. ఈ కారణంగా నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. చికెన్ విక్రయాల ద్వారా వచ్చే లాభాలు తగ్గిపోవడంతో జీవనోపాధి దెబ్బతింటోందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి**

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామ సభల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామ సభల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, లబ్ధిదారుల పేర్లను చదివి వినిపిస్తూ పారదర్శకతను పాటించాలని పేర్కొన్నారు. ఆర్థికంగా, సామాజికంగా లబ్ధి పొందిన వారు తమ అనుభవాలను సభల్లో పంచుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను గ్రామ సభలకు ఆహ్వానించి, వారి ద్వారా సంక్షేమ పథకాలపై వివరాలు తెలియజేయాలని అన్నారు. ముఖ్యమంత్రి సందేశాన్ని గ్రామ సభల్లో వినిపిస్తూ ప్రజల్లో నమ్మకం పెంచాలని సూచించారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారుల ద్వారా కళాజాతలు నిర్వహించి పథకాలపై అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి నిరుపేదకు పథకాల లబ్ధి చేరేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని చెప్పారు. ఏప్రిల్ 6 నుంచి 11 వరకు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఆహార భద్రత, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, రక్షిత మాతృత్వ దినోత్సవం, ఎయిడ్స్ అవగాహన, హోమియోపతి, ఆయుష్, మత్తు పదార్థాల నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

### ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే

# కక్ష సాధింపు

**మొదటి పేజీ తరువాయి**

ఎన్ని కేసులైనా పెట్టండి, నోటీసులు ఇవ్వండి. కానీ నా కుటుంబాన్ని, పార్టీ సభ్యులను ఈ వివాదాల్లోకి లాగడం ఎంతవరకు న్యాయం?' అని ప్రశ్నించారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినా కావాలనే వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని బెదిరింపులకు గురిచేసినా తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇది తన వ్యక్తిగత పోరాటం కాదని, ప్రజల కోసం చేస్తున్న పోరాటమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు తాను ప్రశ్నిస్తూనే ఉంటానని హెచ్చరించారు. ప్రశ్నించే గొంతును అధికార బలంతో అణచివేయలేరని, ప్రజల పక్షాన తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, జనవరి 29న హుజూరాబాద్ నియోజకవర్గం వీణవంకలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా పోలీసులతో వాగ్వాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సీఐడీ అధికారులు, ఏప్రిల్ 4న విచారణకు హాజరుకావాలని పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. కేసుకు సంబంధించిన అంశాలపై విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# 'భట్టి' పద్దులో మౌలిక 'మార్పు' ఏది?


'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అనే నినాదంతో పదేండ్ల విధ్వంసకర పాలన నుంచి తెలంగాణకు విముక్తి 'హస్తం పార్టీ'తో సాధ్యమని నాడు కాంగ్రెస్లీ దర్లు బలమైన ప్రచారం చేశారు. జనం సైతం 'చేతి'లో చేయి వేసి కాంగి'రేసు'ను ముందు వరుసలో ఎన్నికల రణరంగంలో నిలిపి రేవంత్ నాయకత్వంలోని మూడు రంగుల జెండాకు మద్దతు తెలిపారు. 2023 డిసెంబరులో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చారు. ప్రజాప్రభుత్వంలో తమకు కావాలిసిన మార్పు వ్యవస్థలో, విధానాల్లో సాధ్యమయి మంచి చేస్తాడనే ప్రజల ఆశలు అడియాసలుగానే ఉంటున్నాయి. ప్రజా ప్రభుత్వమని పేర్కొనే బడ్జెట్‌లో 27 నెలల పాలనలో మౌలికమైన మార్పు కనపిస్తలేదు. గత సర్కారు మాదిరిగానే 'బంగారు తెలంగాణ'ను చేస్తామంటూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ.. 'కొత్త సీసాలో పాత సారా' అన్నట్లుగానే ఆచరణలో ప్రభుత్వ తీరు ఉన్నది. పద్దు రూపలకల్పనలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు ప్రతిబింబించడం లేదు. కనీసం జనబాహుళ్యం భాగస్వామ్యం ఉండేలా పద్దు రూపకల్పన చేయడం లేదు. కేవలం అధికారులతో మాత్రమే కూర్చొని నామ మాత్రంగా బడ్జెట్ లెక్కల పెంపు జరిగినట్లు స్పష్టమౌతున్నది. ఆర్థిక మంత్రి పద్దు లెక్కల డొక్కలలోకి వెళ్లడం, అంకెల గారడీ చేయడమే తప్ప మౌలికంగా జనం, నిపుణుల భాగస్వామ్యానికి చోటు కల్పించేలా చొరవ కనీసంగా అయినా కనిపించడం లేదు.



> నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి మాటలు, నేడు ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యానాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. 'ఆదాయం పెంచి ప్రజలకు పంచుతాం.. అప్పులు అడ్డగోలుగా చేయబోం' అని బీరాలకు పోయిన కాంగ్రెస్ నాయకుడు నేడు సభా నాయకుడిగా చట్ట సభల సాక్షిగా అప్పుల గురించి చెబుతున్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు గత ప్రభుత్వ పదేండ్ల కాలంలో గల్లంతు అయిన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం కనీసంగా యువత ముఖ్యంగా నిరుద్యోగ యువతకు సంబంధించిన పద్దులో కేటాయింపులు ఆచరణలో యువ'తెలంగాణం' పరిఢవిల్లేలా అంతగా ఆసక్తి చూపినట్టు కనిపించడం లేదు.

### నాటి మాటలు నీటి మూటలే..

నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి మాటలు, నేడు ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యానాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. 'ఆదాయం పెంచి ప్రజలకు పంచుతాం.. అప్పులు అడ్డగోలుగా చేయబోం' అని బీరాలకు పోయిన కాంగ్రెస్ నాయకుడు నేడు సభా నాయకుడిగా చట్ట సభల సాక్షిగా అప్పుల గురించి చెబుతున్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు గత ప్రభుత్వ పదేండ్ల కాలంలో గల్లంతు అయిన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం కనీసంగా యువత ముఖ్యంగా నిరుద్యోగ యువతకు సంబంధించిన పద్దులో కేటాయింపులు ఆచరణలో యువ'తెలంగాణం' పరిఢవిల్లేలా అంతగా ఆసక్తి చూపినట్టు క నిపించడం లేదు. గత పాలకుల మాదిరిగానే ఆదాయ అన్వేషణ మార్గాలను మాత్రం అన్వేషిస్తూ.. ఎక్సయిజ్ ద్వారా డబ్బు వస్తుందనే సూత్రీకరణనే కొనసాగిస్తున్నారు. ప్రస్తుత యుద్ధ ప్రభావం నేపథ్యంలో చమురు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ యువతపై ఏఐ ప్రభావం వంటి నిజమైన చర్చనీయాంశాలను సైతం కనీసంగా పద్దు ప్రతిపాదనల సందర్భంలో ఎక్కడా వెల్లడించలేదు. ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుపైన ఏ మాత్రం వివరణ లేదు. మహిళలకు ఫ్రీ బస్ జర్నీ, ఆరోగ్యశ్రీలో లిమిట్ పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు మరికొన్ని తప్ప మిగతా కీలకమైన హామీలకు పద్దులో కేటాయింపుల్లేవు. మహిళలకు ప్రతీ నెలా రూ.2,500(మహాలక్ష్మి స్కీం కింద), విద్యార్థినులకు స్కూటీలు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారంతో పాటు బోలెడన్ని హామీలు నీటి మూటలేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్కారు పెద్దలకు వీటన్నింటి కంటే కూడా ఫక్తు రాజకీయంపైనే ఫుల్ ఫోకస్ చేస్తున్నారు. 24 గంటలు లాబీయింగ్.. ఢిల్లీ అధిష్టానానికి కంప్లయింట్స్, మంత్రుల వద్ద పైరవీలు, రాజకీయంపైనే సర్కారులోని కీలక వ్యక్తులు ప్రయారిటీ ఇస్తున్నట్లు ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. 'మార్పు' అనేది కేవలం అధికారంలోని పార్టీ మాత్రమేననే అభిప్రాయం జనబాహుళ్యం నుంచి వ్యక్తం అవుతున్నది. బడ్జెట్ ప్రతులలోనిఅక్షరాలు సైతం గత సర్కారు హయంలో మాదిరిగానే అవే పడికట్టు పదాలతో ఉండటం గమనార్హం. నిజంగా క్షేత్రస్థాయిలో ప్రజల స్థితిగతులు, యువత ముఖ్యంగా నిరుద్యోగులకు సంబంధించిన అంశాలు, పన్నెండేండ్ల తెలంగాణలో సాధించుకోలేకపోతున్న అంశాలపైన నిపుణులు, అన్ని రంగాలకు చెందిన ప్రముఖులతో ప్రభుత్వం చర్చలు జరిపి.. వాటన్నింటి సారాన్ని వడపోసి పద్దులో కేటాయింపులు చేసినప్పుడు ప్రజలకు సంబంధించిన పనులకు అడుగులు పడతాయి. అప్పుడు మాత్రమే ప్రజా ప్రభుత్వం అని ప్రస్తుత సర్కారు చెప్పుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఆ దిశగా ఇప్పటికైనా ప్రస్తుత రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఆలోచన చేయాలని ఆశిద్దాం..కోరుదాం.. డిమాండ్ చేద్దాం..



లింగబత్తిని కృష్ణ
సీనియర్ జర్నలిస్ట్
సెల్:9701923260

# ఐదు రోజుల పాటు వర్షాలు

## పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశముందని హెచ్చరించింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వడగళ్ల వానతో పాటు గాలివానలు కూడా తీవ్రంగా ఉండే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈరోజు ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రేపు కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాలకు కూడా ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతంగా ఉండి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. నగర ప్రజలు వర్షాల దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని సూచించింది. వ్యవసాయదారులు తమ పంటలను రక్షించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. వడగళ్ల వాన ప్రభావంతో పంటలకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా ఈదురు గాలులు, మెరుపుల సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# భర్త ఉరివేసుకుని.. భార్య 17వ అంతస్తు పైనుంచి దూకి..

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణకు చెందిన టెక్కీ దంపతులు బెంగళూరులో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. సిద్దిపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కుంట భానుచందర్ రెడ్డి (32) తన అపార్టుమెంట్‌లో ఉరివేసుకుని మృతి చెందగా, ఆ విషయం తెలుసుకున్న అతని భార్య షాజియా అపార్టుమెంట్ 17వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, భానుచందర్ రెడ్డి బెంగళూరులోని ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం భార్య ఇంట్లో లేని సమయంలో కొత్తనూరు ప్రాంతంలోని తన ఫ్లాట్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం ఇంటికి వచ్చిన భార్య తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి సెక్యూరిటీ, స్థానికులను పిలిచింది. తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లగా భానుచందర్ రెడ్డి మృతదేహం కనిపించింది. ఈ దృశ్యం చూసి షాక్‌కు గురైన భార్య షాజియా, కొద్దిసేపటికే అపార్టుమెంట్ పై అంతస్తుకు వెళ్లి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఐబీఎం సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భానుచందర్ రెడ్డి తన మృతికి ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నోట్‌ను స్వాధీనం చేసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. తీవ్ర మానసిక ఒత్తిడి కారణంగానే ఈ ఘటన జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఇద్దరూ గతంలో సహజీవనం చేసి, తొమ్మిదేళ్ల క్రితం వివాహం చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత విభేదాలు, కుటుంబ సమస్యల వల్ల ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.


# ఇల్లంతకుంటలో అసలేం జరుగుతుంది?

## జవార్ వార్ పేటలో జోరుగా ఆన్లైన్ గేమ్స్ దందా

### మండలంలో వందలకోట్ల టర్నోవర్ అంటూ ప్రచారం

- బానిసలుగా మారుతున్న యువత
- చేజేతులా భవిష్యత్తు నాశనం..
- మేము సైతం అంటున్న ప్రజాప్రతినిధులు
- బినామీ ఖాతాలతో ఊబిలో మరెందరో అమాయకులు
- అప్పుల పాలై చితికిపోతున్న కుటుంబాలు
- ఎవరికీ చెప్పకోలేక ప్రాణాలు తీసుకుంటున్న వైనం

**వేద న్యూస్, ఇల్లంతకుంట**



ఇల్లంతకుంట మండలం జవార్‌పేట గ్రామం కేంద్రంగా ఆన్‌లైన్ గేమింగ్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశతో యువతతో పాటు ప్రజాప్రతినిధులు కూడా ఈ వ్యసనానికి బానిసలై తమ బంగారు భవిష్యత్తును, కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. వందల కోట్ల రూపాయల టర్నోవర్‌తో సాగుతున్న ఈ అక్రమ వ్యాపారం, బినామీ ఖాతాలు, నకిలీ సిమ్ కార్డుల అండతో వ్యవస్థీకృత నేరంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

### మాయమాటలతో యువతకు వల

ఆన్‌లైన్ గేమింగ్‌లో పట్టున్న కొందరు వ్యక్తులు లగ్జరీ కార్లలో గ్రామాల్లోకి వచ్చి, యువతను ఆకర్షిస్తున్నారు. ఊహల ప్రపంచంలో విహరింపజేస్తూ వారిని గేమింగ్ ఊబిలోకి దించుతున్నారు. ఈ దందా కోసం కరీంనగర్ వంటి నగరాల్లోని బ్యాంకుల్లో యువత పేరుతో బినామీ ఖాతాలు తెరిపిస్తున్నారు. ఒక్కొక్కరి వద్ద ఇతరుల పేరు మీద ఉన్న దాదాపు 20 సిమ్ కార్డుల వరకు ఉంటున్నాయంటే ఈ నెట్‌వర్క్ ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల ఆర్బీఎల్ బ్యాంకు ఉదంతంలో కూడా ఈ గేమింగ్ ఖాతాల లింకులు బయటపడటం కలకలం రేపుతోంది.

### మేము సైతం అంటున్న ప్రజాప్రతినిధులు..

ఈ వ్యసనం కేవలం యువతకే పరిమితం కాకుండా, గ్రామాల్లోని ప్రజాప్రతినిధులకు కూడా పాకింది. విలాసవంతమైన జీవితం గడుపుతున్న విధానాలను చూపిస్తూ తోటి ప్రజాప్రతినిధులను కూడా ఈ దందావైపు మళ్లిస్తున్నారు. గేమ్‌లో పాల్గొనే వారికి 'గోవా ట్రిప్పులు' వంటి ఆఫర్లు ప్రకటిస్తూ, వారికి రాచమర్యాదలు చేస్తామంటూ ఆశచూపి జీవితాలతో ఆడుకుంటున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్నవారు కూడా ఇందులో భాగస్వాములు కావడంతో ఈ దందా మండలంలో ఒక కంచుకోటలా మారింది.

### చితికిపోతున్న కుటుంబాలు

రోజూ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుండటంతో, డబ్బు పోగొట్టుకున్న వారు అప్పుల పాలై మానసిక వేదనకు గురవుతున్నారు. కొందరు ఆత్మహత్యల వైపు కూడా ఆలోచనలు చేస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. 'వేద న్యూస్' కథనాల ప్రభావంతో ఇప్పటికే ఇల్లంతకుంట మండలంలోని కొన్ని బ్యాంకుల్లో అనుమానాస్పద ఖాతాలను రద్దు చేశారు. కొత్తగా ఖాతాలు తెరిచే వారిపై కూడా బ్యాంకులు కఠినమైన ఆంక్షలు విధిస్తున్నాయి.

### ప్రభుత్వ చర్యలకు విజ్ఞప్తి..

సాంకేతికతను ఆసరాగా చేసుకుని సులభమైన ఆదాయం పేరుతో యువతను పక్కదారి పట్టిస్తున్న ఈ ఆన్‌లైన్ గేమింగ్ మాఫియాపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కేవలం ఒక మండలంలోనే వందల కోట్ల దందా జరుగుతుంటే, దేశవ్యాప్తంగా దీని ప్రభావం ఎంత ఉంటుందో ఊహించడమే కష్టంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ దందాను అరికట్టి యువత భవిష్యత్తును కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వేద న్యూస్

బుధవారం ఏప్రిల్ 01, 2026

# రాజన్న ఆలయ డిప్యూటీ ఈఓగా భాస్కర్ శర్మ నియామకం

**వేద న్యూస్, వేములవాడ:**




దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన డిప్యూటీ ఈఓగా డి. భాస్కర్ శర్మ నియమితులయ్యారు. ప్రస్తుతం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో డిప్యూటీ ఈఓగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్ శర్మను వేములవాడకు బదిలీ చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ అభివృద్ధి దృష్ట్యా ఈ మార్పు చేపట్టినట్లు తెలుస్తోంది. ఉత్తర్వులు అందుకున్న భాస్కర్ శర్మ త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

# వేములవాడ ప్రభుత్వాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

**– క్లిష్ట పరిస్థితుల్లో ప్రత్యేక అనస్థీషియా పద్ధతితో ఆపరేషన్**

**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి తమ ప్రతిభను చాటుకున్నారు. జగిత్యాల జిల్లాకు చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు రొమ్ములో గడ్డ సమస్యతో ఆసుపత్రికి చేరగా, ఆమెకు తీవ్ర మధుమేహం ఉండటంతో పాటు నోరు పూర్తిగా తెరవలేని పరిస్థితి ఉండటంతో సాధారణ జనరల్ అనస్థీషియా ఇవ్వడం వైద్యులకు సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో సీనియర్ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ పెంచలయ్య, అనస్థీషియా నిపుణులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ రాజశ్రీల సూచనల మేరకు 'సెగ్మెంటల్ థొరాసిక్ ఎపిడ్యూరల్ అనస్థీషియా' పద్ధతిని ఉపయోగించి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ బృందంలో డాక్టర్లు మోహన్ కృష్ణ, అలేఖ్య కూడా పాల్గొన్నారు. ఈ విజయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్ హర్షం వ్యక్తం చేస్తూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి స్థానికంగా మెరుగైన వైద్య సేవలు అందించిన వైద్య బృందాన్ని అభినందించారు. ప్రస్తుతం వేములవాడ ప్రభుత్వ



ఆసుపత్రిలో అన్ని రకాల శస్త్రచికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయని, ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

# హోంగార్డ్ తేజ అప్రమత్తత

**– తప్పిన పెద్ద ప్రమాదం**

**– తెగిన కరెంట్ వైర్లను గుర్తించి వెంటనే చర్యలు**



**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో హోంగార్డ్ డ్రైవర్ తేజ అప్రమత్తతతో వ్యవహరించి పెద్ద ప్రమాదాన్ని తప్పించారు. సోమవారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో సిరిసిల్ల డీఎస్పీ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న వేళ, తడూర్ చౌరస్తా వద్ద గాలి కారణంగా కరెంట్ వైర్లు తెగి రోడ్డుకు అడ్డంగా పడినట్లు గమనించారు. ఈ సమయంలో వాహనం నడుపుతున్న డ్రైవర్ తేజ పరిస్థితిని గుర్తించి వెంటనే వాహనాన్ని ఆపి డీఎస్పీకి సమాచారం అందించారు. అధికారులు సంబంధిత విద్యుత్ శాఖకు సమాచారమిచ్చి వెంటనే వైర్లను సరిచేయించడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా నివారించగలిగారు. డ్రైవర్ తేజ చూపిన అప్రమత్తత, చాకచక్యంతో పెద్ద ప్రమాదం తప్పిందని పోలీస్ అధికారులు అభినందించారు. డ్రైవర్ అంటే కేవలం వాహనం నడిపేవారే కాకుండా, ప్రజల ప్రాణాలను కాపాడగల బాధ్యతగల వ్యక్తి అని తేజ నిరూపించారు.

# నడిరోడ్డుపై నిలిచిపోయిన సిమెంట్ లారీ

**– ట్రాఫిక్‌కు అంతరాయం.. వాహనదారులకు ఇబ్బందులు**

**వేద న్యూస్, వేములవాడ:**



వేములవాడలోని తెలంగాణ చౌక్ కూడలిలో సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ అకస్మాత్తుగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మంగళవారం ఉదయం చెక్కపల్లి వైపు నుంచి వస్తున్న లారీ ఇంజిన్ బ్రేక్‌డౌన్ కావడంతో రోడ్డుమధ్యలో ఆగిపోయింది. ఇంజిన్ పనిచేయకపోవడంతో డ్రైవర్ మెకానిక్ కోసం ఎదురుచూస్తున్నాడు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రతాప రామకృష్ణ



**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడకు చెందిన సీనియర్ నాయకుడు ప్రతాప రామకృష్ణను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం సేవలందించిన ఆయన, వేములవాడ సర్పంచిగా కూడా పనిచేశారు. సీనియర్ నాయకుడైన రామకృష్ణకు రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ లక్షణం

**– జెడ్పీహెచ్ఎస్ రుక్మాపూర్‌లో 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమం**

**వేద న్యూస్, చొప్పదండి:**




మండలంలోని జడ్పీహెచ్ఎస్ రుక్మాపూర్ పాఠశాలలో 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ ప్రత్యేకత అని తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా 2015 ఆగస్టు 31న కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణహర్యానా రాష్ట్రాల మధ్య సాంస్కృతిక మార్పిడి జరుగుతూ, వేష భాషలు, ఆచారాలు, జీవన విధానాలపై పరస్పర అవగాహన పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తుమ్మనపల్లి విద్యాసాగర్ రావు, కన్వీనర్ ఉమాదేవి, ఉపాధ్యాయులు అంజయ్య, శ్రీవాణి, మాధవరావు, శారద, మల్లికార్జున్, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్, సి ఆర్ పి సురేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# గీతా విద్యాలయంలో గ్రాడ్యుయేషన్ డే

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి పట్టణంలోని గీతా విద్యాలయం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జేమ్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రోంజ్ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు పాఠశాల చైర్మన్ గుర్రం ఆనంద రెడ్డి, డైరెక్టర్ లింగారావు అందజేశారు. అలాగే గురుకులాల్లో సీట్లు సాధించిన ఏడుగురు విద్యార్థులను తల్లిదండ్రుల సమక్షంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హనుమాన్ దేవాలయంలో పూజా కార్యక్రమాలు

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, అభిషేకం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించగా, ఉదయం నుంచే గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజల శ్రేయస్సు, శాంతి, సుభిక్షం కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించగా, పెద్ద ఎత్తున పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.



# భద్రకాళి దేవస్థానానికి 50 అడుగుల నూతన ధ్వజస్తంభం

**– అరుదైన నారవేప కర్రతో ఏర్పాటుకు చర్యలు**

**వేద న్యూస్, వరంగల్:**



వరంగల్ భద్రకాళి దేవస్థానానికి సుమారు 50 అడుగుల ఎత్తుతో నూతన ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయనున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మరియు ఆలయ ఈవో రామాల సునీత అనుమతితో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ సమీపంలోని వెంకటాపురం ఫారెస్ట్ రేంజ్‌లో, డీఎఫ్ఓ ఆదేశాల మేరకు ఫారెస్ట్ రేంజర్ తుల్జా నేతృత్వంలో అరుదైన నారవేప కర్రను ఎంపిక చేశారు. ఈ కర్రతో ధ్వజస్తంభాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో భద్రకాళి వ్యవస్థాపక అర్చకులు బండారి శేషయ్యతో పాటు ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణ, మోత్కూరి మయూరి–రామేశ్వర్, పాలడుగుల ఆంజనేయులు, జరతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఇంకా సుమారు 20 రోజుల్లో ధ్వజస్తంభాన్ని ఆలయానికి తరలించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# ఓటరు జాబితా సవరణకు ప్రతి ఒక్కరు సహకరించాలి

**వేద న్యూస్, మందమర్రి :**

ఓటరు జాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఓటరు తమ ఓటరు గుర్తింపును తప్పనిసరిగా సరిచూసుకొని బూత్ లెవెల్ ఆఫీసర్ కు ఎన్యూమరేటర్ ఫారంలో పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. ఓటర్ గుర్తింపు కార్డులో ఏమైనా పొరపాట్లు ఉన్నట్లయితే తక్షణమే వాటిని సరి చేసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయిలో సహాయకులుగా పనిచేయడానికి బూత్ లెవెల్ ఏజెంట్ లును నియమిస్తా రని పేర్కొన్నారు. ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం లో ప్రతి ఓటర్ పాల్గొ ని సహకరించాలని తెలిపారు. ఈ సమావేశ లో డిప్యూటీ తాసిల్దార్ సంతోష్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



వేద న్యూస్

బుధవారం ఏప్రిల్ 01, 2026

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నరేష్ పటేల్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులను నియమించడం జరిగింది. అందులో భాగంగా వరంగల్ జిల్లాకు సంబంధించిన సిద్ధం నరేష్ పటేల్ ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించారు. తమ నియామానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు ఎం రామ చంద్రరావుకి రాష్ట్ర కార్యవర్గనికి వరంగల్ జిల్లా అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ భారతీయ జనతా పార్టీ వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే కాంటెస్ట్ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని బాధ్యతగా నిర్వహిస్తానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందొద్దు

- జిల్లాలో పుష్కలంగా నిల్వలు
- డీఎస్ఓ బుచ్చిబాబు




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో వంట గ్యాస్ కొరత లేదని, వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా పౌర సరఫరాల అధికారి డీఎస్ఓ ఎల్. బుచ్చిబాబు తెలిపారు. జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, గ్యాస్ ఏజెన్సీలు బుకింగ్ తేదీల క్రమంలో సిలిండర్లను సరఫరా చేస్తున్నాయని ఆయన వివరించారు. సరఫరా వ్యవస్థపై అధికారులు ఆయిల్ కంపెనీలతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు అనవసర భయంతో డబుల్ బుకింగ్ చేయకుండా, అవసరానికి తగ్గట్టే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ ప్రాంతాల్లో 25 రోజుల్లోపు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల్లోపు సిలిండర్లు డెలివరీ అవుతున్నాయని తెలిపారు. గ్యాస్ సరఫరా సజావుగా కొనసాగుతున్నందున ప్రజలు ఆందోళన చెందవద్దని బుచ్చిబాబు కోరారు.

## జనగణనలో మాస్టర్ ట్రైనర్లు కీలకం

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సీఎంఎంఎస్, డిజిటల్ విధానం, హౌస్ లిస్టింగ్‌పై శిక్షణ



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జనగణన-2027లో మాస్టర్ ట్రైనర్లు కీలక పాత్ర పోషిస్తారని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో మాస్టర్ ట్రైనర్లకు సీఎంఎంఎస్, డిజిటల్ విధానం, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్‌పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి మంగళవారం హాజరైన కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రంలో మొదటిసారిగా డిజిటల్ విధానంలో జనగణన నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి దశలో మే 11 నుంచి జూన్ 9 వరకు గృహ గణన, రెండో దశలో ఫిబ్రవరి 2027లో వ్యక్తిగత వివరాల సేకరణ చేపడతారని వెల్లడించారు. జనగణన వివరాలు అత్యంత కీలకమని, శిక్షణను సద్వినియోగం చేసుకుని బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్స్ మాస్టర్ ట్రైనర్ శివరామకృష్ణ పవర్ పాయింట్ ద్వారా వివిధ అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, గణాంక అధికారి సంపత్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- 14 మందికి జరిమానా

**వేద న్యూస్, సిరిసిల్ల:**



సిరిసిల్ల పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 14 మంది మందుబాబులు పట్టుబడ్డారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరచగా, మేజిస్ట్రేట్ జయశ్రీ జరిమానాలు విధించారు. నలుగురికి రూ. 5వేలు, నలుగురికి రూ. 2వేలు, నలుగురికి రూ. 1,000, ఒకరికి రూ. 6వేలు, మరొకరికి రూ. 1,500 చొప్పున జరిమానాలు విధించినట్లు టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్ ఆధ్వర్యంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడపబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలపై కూడా ప్రభావం పడుతుందని సూచించారు.

## ఇంద్రమ్మ ఇళ్ల పేరుతో లంచాల దందా..?

- రాజాపూర్ పంచాయతీ కార్యదర్శిపై ఆరోపణలు
- పర్మిషన్లు, పింఛన్ల కోసం వసూళ్లు చేస్తున్నారని గ్రామస్తుల ఫిర్యాదు




**వేద న్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలోని రాజాపూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిపై లంచాల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంద్రమ్మ ఇళ్ల పర్మిషన్లు, పింఛన్ల మంజూరు పేరుతో కార్యదర్శి మహబూబ్ పాషా డబ్బులు వసూలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పర్మిషన్లు ఇవ్వడంలో ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తూ, కొన్నిసార్లు నేరుగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. ఆన్లైన్ లావాదేవీల ద్వారా పంపిన డబ్బుల వివరాలు తమ వద్ద ఆధారాలుగా ఉన్నాయని తెలిపారు. లంచం ఇవ్వని వారి ఫైళ్లను పెండింగ్‌లో ఉంచుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఎంపీఓ కాసాగోని ప్రభాకర్ ప్రాథమిక విచారణ చేపట్టగా, బాధితులు ఫోన్‌పే లావాదేవీల వివరాలను చూపించినట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

- 'అరైవ్ అలైవ్' సిరిసిల్లలో కార్యక్రమం

**వేద న్యూస్, సిరిసిల్ల:**



సిరిసిల్ల పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మోడెం సురేష్, టౌన్ సీఐ శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రతపై దిశానిర్దేశం చేశారు. తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితె, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్ర చారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. సీఐ సురేష్ మాట్లాడుతూ.. రోడ్డు నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, జీబ్రా క్రాసింగ్ ప్రాముఖ్యత, ట్రిపుల్ రైడింగ్ నిషేధం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సురక్షితంగా ప్రయాణించడంతో పాటు సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్, ఉపాధ్యాయులు, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## భూశంకరయ్యకు ఘనంగా వీడ్కోలు

**వేద న్యూస్, మందమర్రి:**



మందమర్రి ఏరియా లో ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌గా సుదీర్ఘ కాలం సేవలందించిన భూశంకరయ్య మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పా టు చేసిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, బెల్లంపల్లి రీజనల్ సేఫ్టీ జీఎం రఘు కుమార్ హాజరై, భూశంకరయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ, భూశంకరయ్య తన సుదీర్ఘ సర్వీసులో సంస్థ అభివృద్ధికి, ముఖ్యంగా గనుల్లో భద్రతా ప్రమాణాల పెంపునకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. నిబద్ధతతో పనిచేసే అధికారుల వల్లనే సింగరేణి సంస్థ విజయవంతంగా నడుస్తోందని, ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో గడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జి.ఎం సేఫ్టీ రఘుకుమార్, జి.ఎల్. ప్రసాద్, డి.జి.ఎమ్ (పర్సనల్) అశోక్ మాట్లాడుతూ, భూశంకరయ్యతో తమకున్న పని అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విధి నిర్వహణలో ఆయన కనబరిచిన చొరవ అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. అనంతరం భూశంకరయ్య మాట్లాడుతూ, తన ఉద్యోగ ప్రస్థానంలో సహకరించిన అధికారులకు, తోటి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.ఎం సేఫ్టీ బి.పి.ఏ రీజియన్ రఘు కుమార్, ఎస్.ఓ.టు జి.ఎం జి.ఎల్ ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, అన్ని డిపార్ట్మెంట్ల హెచ్.ఓ.డిలు, జి.ఎమ్ కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు వీడ్కోలు పలికారు.

## ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం

- రిటైర్డ్ ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులకు న్యాయంఎక్కడ..?
- జాగృతి నేత హరిప్రసాద్

**వేద న్యూస్, కరీంనగర్:**



కరీంనగర్ జిల్లా జాగృతి కార్యాలయంలో మంగళవారం జాగృతి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనారిటీ మహిళ నాయకురాలు అసియా సుల్తానా, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు గోష్కి కుమార్ జాగృతిలో చేరగా, జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ప్రజా సమస్యలకు పరిష్కారం చూపలేదని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు, రైతు కూలీలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. వృద్ధులకు పెన్షన్ పెంపు, ఉద్యమకారులకు గుర్తింపు, ఇళ్ల స్థలాలు వంటి హామీలు అమలు కాలేదని ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల డీఏ బకాయిలు, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది రిటైర్డ్ ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిల కోసం ఆందోళనలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జాగృతి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, నాయకులు రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్, శ్రీరాముల రమేష్, జంగ అపర్ణ, కుతాడి రజిత తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం ఏప్రిల్ 01, 2026

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 92వ మహాజనసభ

- సొసైటీలో నిధులు దుర్వినియోగంపై రైతుల ఆగ్రహం
- అసిస్టెంట్ రిజిస్ట్రార్, సెక్రటరీలను నిలదీసిన రైతులు



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద మంగళవారం అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంబర్ సింగ్ అధ్యక్షతన 92వ మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ మహాజన సభలో సెక్రటరీ గంగాధర్ జమ, ఖర్చుల వివరాలు చదివి వినిపించారు. అయితే జమ, ఖర్చుల లెక్కల్లో తేడా రావడంతో రైతులు తీవ్రంగా మండిపడ్డారు. గతంలో ఉన్న చైర్మన్, సెక్రటరీ సొసైటీలో జమ చేయాల్సిన నిధులు జమ చేయకుండా నిధులు దుర్వినియోగం చేశారంటూ రైతులు అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంబర్ సింగ్, సెక్రటరీ గంగాధర్ ను నిలదీశారు. అదేవిధంగా సెక్రటరీ లక్ష్మణ్ ప్రస్తుతం విధుల్లో లేకున్నా కూడా ఆయనకు రెండు నెలల వేతనం ఎలా చెల్లిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిదంగా సహకార సంఘంలో పనిచేసే సిబ్బందికి సంబంధించిన పిఎఫ్ డబ్బులు వారి ఖాతాలలో జమ చేయాల్సి ఉండగా వాటిని కూడా కాజేసినట్లు సిబ్బంది పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, సిబ్బందికి పిఎఫ్ డబ్బులు ఇప్పించాలని రైతులు కోరారు.

## అంగరంగ వైభవంగా మెట్టుగుట్ట శ్రీరాముడి రథోత్సవం



- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శ్రీరాముడి ప్రతిమ

**వేద న్యూస్, మడికొండ:**

దక్షిణ కాశీగా పేరుగాంచిన మెట్టుగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం సాయంత్రం శ్రీరాముడి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు విష్ణువర్ధనాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, స్థానిక సీఐ పుల్యాల కిషన్, ఎస్సైలు రాజబాబు, రామ్మోహన్, ఏఎస్ఐ మహిపాల్ రెడ్డి, రామాలయం చైర్మన్ పల్లపు అర్జున్, ఆలయ కార్యనిర్వాహక అధికారి సత్యనారాయణతో కలిసి కొబ్బరికాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు రథానికి దారి పొడవునా నీళ్లు పోసి, కొబ్బరికాయలు కొట్టి, పూలుఫలాలతో స్వాగతం పలికారు. భక్తులు డప్పు చప్పులతో, దేవతల వేషధారణలతో, కోలాటాలతో, చిన్నారుల ఆటలతో ఉత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వయంగా రథాన్ని లాగుతూ గ్రామమంతా ఊరేగించారు. ఈ ఊరేగింపులో శ్రీరాముడి ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అర్చకులు అభిలాష్ శర్మ, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఆలయ సిబ్బంది, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించాలి




- ఎమ్మెల్యే జీఎస్సార్
- మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**వేద న్యూస్, శాయంపేట:**

భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) మంగళవారం ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ సహకారంతో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు తమ పంటలను మధ్యవర్తుల వద్ద విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని సూచించారు. రైతులకు న్యాయమైన ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు సరైన ధర లభించడంతో పాటు మధ్యవర్తుల ప్రభావం తగ్గి, రైతుల ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ అధికారులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్, సర్పంచ్ చింతల ఉమ రవిపాల్, కాంగ్రెస్ నాయకులు దూదిపాల బుచ్చిరెడ్డి, చల్లా చక్రపాణి, పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, చిందం రవి, వరదరాజు, రైతులు పాల్గొన్నారు.

## పెద్ది ధర్నా రైతులను మోసం చేయడమే

- మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నిర్వహించిన ధర్నాపై తీవ్రంగా విమర్శించారు. ఆ ధర్నా రైతులను మోసం చేసే నాటకమని ఆరోపిస్తూ, రంగయ్య చెరువు రిజర్వాయర్ ప్రాజెక్టును అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసి రైతులను ద్రోహం చేసిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందన్నారు. కాలువలు పూర్తిచేయక వేల ఎకరాలు ఎండబెట్టిన వారే ఇప్పుడు రైతు హితవాదులుగా మారడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే మాధవరెడ్డి నేతృత్వంలో కాలువలను పునరుద్ధరించి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గతంలో పనులు చేయని వారు ఇప్పుడు రైతు ప్రేమను ప్రదర్శించడం నమ్మశక్యం కాదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులకు నష్టం కలిగించిన వారికి ప్రజలే తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైనాల అశోక్, ఎర్రబెల్లి రఘుపతి రావు, మాలోత్ చరణ్ సింగ్, జెట్టి రామూర్తి, కొంరరెడ్డి, పోగుల బాహు సింగ్, సర్పంచులు భాస్కర్, అనిత, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బుచ్చిరెడ్డిపల్లిలో గుండెపోటుతో రైతు మృతి



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు బాదావత్ సోమ్లా గుండెపోటుతో మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. సోమ్లా ఉదయం చేనుకు వెళ్లి జొన్నలను ఎండబెట్టి ఇంటికి వస్తుండగా తీవ్ర ఎండ కారణంగా అస్వస్థతకు గురై ఛాతినొప్పితో కుప్పకూలినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే అతన్ని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రైతు కుటుంబానికి ప్రభుత్వం తగిన సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## గ్రామాభివృద్ధియే ధ్యేయం

- సర్పంచ్ గుగులోత్ సుజాత సంతోష్ నాయక్



**వేదన్యూస్ ,కారేపల్లి:**

మండలంలోని అన్ని గ్రామాలు ఇప్పుడు అభివృద్ధితో పరుగులు పెడుతున్నాయి. గత కొంతకాలంగా పాలకవర్గం లేక,సరైన పర్యవేక్షణ కరువై కుంటుపడిన అభివృద్ధి పనులకు సర్పంచుల రాకతో పల్లె ప్రగతి పరుగులు పెడుతోంది.తాజాగా మంగళవారం పాటిమీద గుంపు గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద నూతనంగా మంజూరైన రూ.10 లక్షల వ్యయంతో బచ్చేలా బుజమ్మ, బచ్చేలా భాస్కర్ ఇంటి వరకు 3 లక్షలు ,బానోత్ రాములు,ఇంటి నుండి నాగ ఇంటి వరకు రూ.7లక్షలు వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధియే ధ్యేయం అని స్పష్టం చేసారు. గ్రామంలో అంతర్గత రహదారుల అభివృద్ధికి తాము పెద్దపీట వేస్తున్నామని తెలిపారు.ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకుంటూ,గ్రామంలో ఎక్కడా బురద రోడ్లు లేకుండా చేస్తున్నామని పేర్కొన్నారు.గ్రామంలో మౌలిక సదుపాయాలకు కృషి చేస్తామని,ప్రభుత్వ నిధులను నేరుగా ప్రజల అవసరాల కోసం ఖర్చు చేస్తూ, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంజుల ,వార్డు సభ్యులు,విజయ, ఈసం రమేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ఒకేసారి
## మూడు నెలల 'సన్న బియ్యం' పంపిణీ

**వేద న్యూస్ ,కారేపల్లి:**

తెలంగాణ రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వేసవి కాలం దృష్ట్యా పేద ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఏప్రిల్ 1వ తేదీ నుండి ఏకకాలంలో మూడు నెలల కోటా సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దారావత్ భద్రునాయక్ కీలక వివరాలను వెల్లడించారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బియ్యం నేటి నుండే అందుబాటులో ఉంటాయి.

**నాణ్యమైన 'సన్న బియ్యం'.**

ప్రతి లబ్ధిదారునికి (ఒక్కొక్కరికి) మొత్తం 18 కేజీల బియ్యం పంపిణీ చేయబడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ చౌక ధరల దుకాణాల (రేషన్ షాపుల) ద్వారా "పేద ప్రజల ఆకలి తీర్చడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. వేసవి కష్టాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని దారావత్ భద్రునాయక్,పేర్కొన్నారు.

## చేనేత సహకార సంఘం మహాసభ నిర్వహణ

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట చేనేత సహకార సంఘంలో పర్సన్ ఇన్‌చార్జ్ బి. సునీత అధ్యక్షతన మంగళవారం 64వ వార్షిక, 81వ అర్ధ వార్షిక సాధారణ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభలో గత ఆరు నెలల వ్యాపార లావాదేవీలపై నివేదికను సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారి బొట్టు వెంకటేశ్వర్లు, డీఎంఓ బి. వెంకటేశ్వర్లు, డీఓ (హ్యాండ్లూమ్ & టెక్స్టైల్స్), మాజీ అధ్యక్షుడు బాసని రవి, దిడ్డి రమేష్, మామిడి శంకర్ లింగం, పద్మశాలి కుల పెద్దలు, సంఘ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

## రేషన్ లబ్ధిదారులకు శుభవార్త

- మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- తహసీల్దార్ ముప్పు కృష్ణ

**వేద న్యూస్, నల్లబెల్లి:**




నల్లబెల్లి మండల రేషన్ కార్డుదారులకు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి అందజేయనున్నట్లు తహసీల్దార్ ముప్పు కృష్ణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు నేటి నుంచి మండలంలోని చౌక ధరల దుకాణాల్లో బియ్యం పంపిణీ ప్రారంభం కానుంది. సాధారణంగా ప్రతి నెల విడిగా అందించే బియ్యాన్ని ఈసారి ఏప్రిల్, మే, జూన్ నెలలకు కలిపి ఒకేసారి పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు రేషన్ దుకాణాలకు బియ్యం నిల్వలను తరలించే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. మూడు నెలల పంపిణీ నేపథ్యంలో ఏప్రిల్ నెలంతా రేషన్ దుకాణాలు తెరిచి ఉండనున్నాయి. లబ్ధిదారులు తమ సౌకర్యానికి అనుగుణంగా బియ్యం పొందాలని అధికారులు సూచించారు.

# నిరుపేదల సంక్షేమమే ధ్యేయం



**ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి**

**వేద న్యూస్, దేవరకద్ర/కౌకుంట్ల:**

దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కౌకుంట్ల మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థికంగా తోడ్పడేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందించడం గొప్ప ఉపశమనమని పేర్కొన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్నామని స్పష్టం చేశారు. నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కష్టపడి శ్రమిస్తేనే జీవితంలో ఎదుగుతారు

- మంత్రి డా. వాకిటి శ్రీహరి
- ఆత్మకూరులో 'విజ్ఞాన వైభవం-2026' ప్రారంభం

**వేద న్యూస్, ఆత్మకూర్:**

ఆత్మకూర్ పట్టణంలోని ఎంవీ రామన్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన 'విజ్ఞాన వైభవం-2026' కార్యక్రమాన్ని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి ప్రారంభించారు. పాఠశాల చైర్మన్ డా. శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి శ్రమిస్తేనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. అన్ని దానాల్లో విద్యాదానం గొప్పదని, విద్య ఎవరి సొత్తు కాదని తెలిపారు. గురువులు చెప్పే పాఠాలను శ్రద్ధగా నేర్చుకుంటే చదువులో రాణించగలరని సూచించారు. జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దానిని సాధించేందుకు కృషి చేయాలని, తల్లిదండ్రులు, గురువులే నిజమైన మార్గదర్శకులని అన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన 51 స్టాల్స్ ద్వారా సుమారు 720 ప్రదర్శనలు నిర్వహించిన పాఠశాల యాజమాన్యం, విద్యార్థులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగమణి, వైస్ చైర్‌పర్సన్ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బిజినపల్లిలో మెగా స్పెషలిస్ట్ వైద్య శిబిరం

- మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- వైద్యాధికారి డాక్టర్ పి. సృజన



**వేద న్యూస్, నాగర్ కర్నూల్:**

బిజినపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా మెగా స్పెషలిస్ట్ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యాధి,కారి డాక్టర్ పి. సృజన మాట్లాడుతూ.. నిపుణులైన వైద్యులు గ్రామాలకు వచ్చి సేవలు అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యుల సూచనలు పాటించి ఆరోగ్యకరమైన జీవనం గడపాలని తెలిపారు. ఈ శిబిరంలో స్త్రీ వైద్య నిపుణులు, శిశు వైద్యులు, ఎముకలు, కీళ్ల నిపుణులు, దంత వైద్యులు, కంటి వైద్యులు, జనరల్ ఫిజీషియన్లు పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే రక్త, మూత్ర పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన చికిత్స అందించనున్నట్లు చెప్పారు. మండల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9490927816, 9441628160 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# అంగన్వాడీ కేంద్రాల పని వేళల్లో మార్పులు..



**వేద న్యూస్ హైదరాబాద్ :**

రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో అంగన్వాడీ కేంద్రాలను హాఫ్ డే పద్ధతిలో నిర్వహించేందుకు అనుమతించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 30 వరకు అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం12.30 గంటల వరకు పనిచేస్తాయి. మే 1 నుంచి మే 31 వరకు అంగన్వాడీ పిల్లలకు వేసవి సెలవులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంగన్వాడీ పిల్లలతో పాటు టీచర్లు హెల్పర్లకు సెలవులు మంజూరు చేశారు. అయితే, సెలవుల సమయంలో అంగన్వాడీ సిబ్బంది కొన్ని బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. పిల్లలకు సరుకులును ఇంటికి (ాు=) పంపిణీ చేయాలి. 05 సంవత్సరాల పిల్లల్లో అభివృద్ధి సంబంధిత లోపాలను ముందుగానే గుర్తించేందుకు ఇంటింటి సర్వేలు నిర్వహించాలి. ప్రీ-స్కూల్‌లో పిల్లల నమోదు. డ్రాప్‌ఔట్ అయిన పిల్లలను మళ్లీ అంగన్వాడి కేంద్రాల్లో చేర్చే విధంగా చర్యలు చేపట్టాలి. వేసవి సెలవుల్లో అంగన్వాడీ సిబ్బంది తాము నిర్వహించిన కార్యకలాపాలపై సమగ్ర నివేదిక సమర్పించాలి. ఏప్రిల్ 27 నుంచి మే 2 వరకు జరిగే 'చైల్డ్ సేఫ్టీ వీక్', మే 25 నుంచి మే 30 వరకు నిర్వహించే 'వుమెన్ థీమ్ వీక్' కార్యక్రమాల్లో అంగన్ వాడీ సిబ్బంది పాల్గొనాలని మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు.

# చదువుతోపాటు సంస్కారం నేర్పించాలి

- ఎమ్మెల్యే మేఘారెడ్డి
- విద్యా వ్యవస్థ బలోపేతానికి వెయ్యి కోట్లు కేటాయింపు

**వేద న్యూస్, వనపర్తి:**

విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, మానవతా విలువలు నేర్పించడం అత్యంత అవసరమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బచ్ పన్ పాఠశాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రైవేట్ విద్యాసంస్థల స్థాపన పట్టణ అభివృద్ధికి సూచిక అని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించేలా పాఠశాలలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి సుమారు రూ.1000 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని వివరించారు. పాఠశాల ఏర్పాటు చేసిన రాసీపల్లి శ్రీనివాసులు, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న



నిరుద్యోగులకు పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్ క్రాంతి గౌడ్, పాఠశాల యాజమాన్యం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈర్లపల్లిలో మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

- తహసీల్దార్ కు గ్రామస్తుల వినతి పత్రం సమర్పణ

**వేద న్యూస్, జడ్చర్ల:**

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఈర్లపల్లి గ్రామంలో మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం ఎమ్మార్వో నర్సింగ్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. గ్రామంలోని సర్వే నంబర్ 50లో ఉన్న గుట్ట (కొండ) తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆ గుట్ట పశువుల మేతకు, గ్రామస్తుల జీవనోపాధికి కీలకమని తెలిపారు. తవ్వకాల వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందని, భూగర్భ జలాల లభ్యత తగ్గిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పక్షుల నివాసానికి కూడా ప్రమాదం కలుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల వెంటనే మైనింగ్ అనుమతులను రద్దు చేసి



తవ్వకాలను నిలిపివేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శంకర్, నంద, కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# రంగశాయిపేటలో ఘనంగా బండ్ల జాతర

- సంప్రదాయం, సంస్కృతికి ప్రతీకగా వేడుకలు
- అలరించిన కుమ్మరుల ఎడ్ల బండ్ల ఊరేగింపు



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రంగశాయిపేటలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీరామ నవమి వేడుకలలో భాగంగా మంగళవారం నిర్వహించిన బండ్ల జాతర విశేషంగా ఆకట్టుకుంది. ఈ జాతర కేవలం ఉత్సవ కార్యక్రమంలా మాత్రమే కాకుండా, గ్రామీణ సంస్కృతి, వృత్తి ఆధారిత సమాజాల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ముఖ్యంగా శాలివాహన (కుమ్మరి) కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా ఎడ్ల బండ్లను అందంగా అలంకరించారు. ఎద్దులపై రంగులు చల్లి, బండ్లకు జెండాలు కట్టి, పూలతో రాముని చిత్రపటాన్ని అలంకరించి వీధుల వెంట భారీ ర్యాలీగా తీసుకెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి బండి ఒక ప్రత్యేకతను చాటుతూ, కళాత్మకతను ప్రతిబింబించింది. డీజే పాటలతో యువత ఉత్సాహంగా పాల్గొనగా, పెద్దలు సంప్రదాయాన్ని కొనసాగించే బాధ్యతతో ఈ వేడుకలో భాగమయ్యారు. సంప్రదాయంఆధునికత కలయికగా ఈ జాతర కొనసాగడం విశేషం. గ్రామీణ జీవన విధానంలో ఎడ్ల బండ్ల ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ, ఈ కార్యక్రమం పాత సంప్రదాయాలకు కొత్త ఊపిరి పోసింది. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ పులిగిల్ల వెంకటరామ నరసింహ శాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల శ్రీధర్ ఆచార్యులు, 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, ఖిలా వరంగల్ పిఎసిఎస్ మాజీ చైర్మన్ కేడల జనార్ధన్, గండ్రాతి కుమార్(జీకే), ఆలయ ట్రస్ట్ చైర్మన్ పులిగిల్ల వెంకట రామ నరసింహ శాస్త్రి, ఆలయ ధర్మకర్తలు ఆవునూరి కుమారస్వామి, వద్దిరాజు శ్రీనివాసరావు, విలాసాగరం శ్రీనువాసు(చిన్న), సోమ అనిల్, బొల్లెపల్లి సరిత, రంగశాయిపేట శంభునిపేట శ్రీ శాలివాహన (కుమ్మరి) వెల్ఫేర్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేశారు. సమాజంలోని వివిధ వర్గాలు ఒకే వేదికపై కలిసిన ఈ సందర్భం సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. మొత్తంగా, రంగశాయిపేట బండ్ల జాతర గ్రామీణ సంస్కృతిని సజీవంగా నిలుపుతూ, తరతరాలకు సంక్రమించే సంప్రదాయ విలువలను గుర్తుచేసిన ఒక అద్భుతమైన వేడుకగా నిలిచింది.

# నిజాం షుగర్ ఫ్యాక్టరీ గోదాములపై కలెక్టర్ సమీక్ష

- రబీ సీజన్‌కు వడ్ల నిల్వపై ప్రత్యేక దృష్టి
- భద్రత, తేమ నియంత్రణపై సూచనలు
- రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలు

**వేద న్యూస్ మల్లాపూర్ :**

మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న గోదాములను పరిశీలిస్తూ రాబోయే రబీ సీజన్‌కు సంబంధించి వడ్ల నిల్వ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాముల సామర్థ్యం, భద్రతా ప్రమాణాలు, తేమ నియంత్రణ వంటి అంశాలను కలెక్టర్ పరిశీలించారు. వడ్లను సురక్షితంగా నిల్వ చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిల్వ సమయంలో ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో వడ్లు నిల్వ చేయడానికి అనువైన గోదాములను గుర్తించాలని మెట్‌పల్లి ఆర్డీవో నరసింహారావుకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాబోయే రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ, నిల్వ ప్రక్రియలు సమర్థవంతంగా నిర్వహించాల్సిన



అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిల్వ సదుపాయాలను బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. సమన్వయంతో పనిచేస్తే ధాన్యం నిర్వహణ సజావుగా సాగుతుందని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహారావు, తహసీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వేదికలపై గంగూలీ స్పందన



**వేద న్యూస్ డెస్క్:**

భారత్‌ఆస్ట్రేలియా మధ్య జరగనున్న బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్ వేదికల ఎంపికపై టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ స్పందించారు. ఈడెన్ గార్డెన్స్‌లో మ్యాచ్ జరగకపోవడం పట్ల కొంత నిరాశ ఉన్నప్పటికీ, భారత క్రికెట్ నియంత్రణ మండలి తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఆయన అభిప్రాయపడ్డారు. మాజీ క్రికెటర్‌గా కోల్‌కతాలో మ్యాచ్ జరగాలని కోరుకుంటానని చెప్పిన గంగూలీ, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర మైదానాలకు కూడా అవకాశాలు ఇవ్వడం అవసరమని తెలిపారు. గువాహటి, రాంచీ వంటి నగరాల్లో టెస్టులు నిర్వహించడం ద్వారా అక్కడి అభిమానులకు మంచి అవకాశం దక్కుతుందని, ప్రస్తుతం దేశంలోని స్టేడియాలు అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపోయే సదుపాయాలతో ఉన్నాయని వివరించారు. 2001లో ఈడెన్ గార్డెన్స్‌లో ఆస్ట్రేలియాపై సాధించిన చారిత్రక విజయాన్ని గుర్తుచేసుకుంటూ, ఆ మ్యాచ్‌లో ఆడిన ఆటగాళ్లతో మళ్లీ కలుసుకునే కార్యక్రమాన్ని ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెలలోనే సమావేశం కావాలని అనుకున్నప్పటికీ, సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ వివాహం కారణంగా ఆ భేటీని వాయిదా వేసినట్లు చెప్పారు. తన కెరీర్‌లో లార్డ్స్‌లో జరిగిన నాట్‌వెస్ట్ ట్రోఫీ విజయంతో పోలిస్తే కోల్‌కతా, అడిలైడ్, హెడింగ్లేలో సాధించిన టెస్టు విజయాలే తనకు ఎక్కువ సంతృప్తినిచ్చాయని గంగూలీ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో వీరేంద్ర సెహ్వాగ్ త్రిశతకం గురించి మాట్లాడుతూ, 300 పరుగుల దగ్గర సింగిల్ తీసుకోమని చెప్పినా, సిక్స్ కొట్టి పూర్తి చేసిన సంఘటనను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్ నగరాలు ఈ సిరీస్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. కొత్త వేదికలకు అవకాశాలు ఇవ్వడం ద్వారా భారత క్రికెట్ మరింత విస్తృత స్థాయిలో అభివృద్ధి చెందుతుందని గంగూలీ అభిప్రాయపడ్డారు.

# ధోనీతో మాట్లాడలేదంటే అదే కారణం

**వేద న్యూస్ డెస్క్:**



చెన్నై సూపర్ కింగ్స్ రీయూనియన్ కార్యక్రమంలో రవీంద్ర జడేజా, మహేంద్ర సింగ్ ధోనీ ఒకరితో ఒకరు మాట్లాడుకోకపోవడం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీసింది. వీరిద్దరి మధ్య విభేదాలున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జడేజా క్లారిటీ ఇచ్చాడు. ఈ వివాదంపై స్పందించిన జడేజా, తమ మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని స్పష్టం చేశాడు. "రీయూనియన్‌కు వెళ్లే ముందు మహీ భాయ్‌కు ఫోన్ చేయాలనుకున్నాను. కానీ ఆ సమయంలో ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. అక్కడికి వెళ్లిన తర్వాత కూడా కార్యక్రమం చాలా రద్దీగా ఉండటంతో మాట్లాడుకునే అవకాశం రాలేదు. అంతే తప్ప ఎలాంటి గొడవ లేదు" అని తెలిపాడు. ధోనీ ఫోన్ ఎప్పుడూ అందుబాటులో ఉండదని, ఆయనను కలవడం ఫోన్ చేయడానికంటే కష్టమని జడేజా సరదాగా వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలు అభిమానుల్లో చిరునవ్వులు పూయించాయి. గతంలో ఐపీఎల్ 2022 సమయంలో కెప్టెన్సీ మార్పుల నేపథ్యంలో వీరిద్దరి మధ్య విభేదాలున్నాయని వార్తలు వచ్చాయి. అయితే 2023 ఫైనల్‌లో జడేజా విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించగా, ధోనీ అతడిని ఎత్తుకుని సంబరాలు చేసుకోవడంతో ఆ వార్తలు పూర్తిగా కొట్టివేయబడ్డాయి. ఇప్పుడు మళ్లీ ఇలాంటి చిన్న విషయాలను పెద్దవి చేయవద్దని జడేజా అభిమానులను కోరాడు. ధోనీ తనకు ఎప్పటికీ గురువే అని, ఆయనపై గౌరవం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేశాడు. ఈ వివరణతో అభిమానులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

# సెలబ్రేషన్స్‌పై క్లారిటీ ఇచ్చిన దిగ్వేశ్

**వేద న్యూస్ డెస్క్:**



ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్న యువ ఆటగాడు దిగ్వేశ్ రాఠీ మరోసారి తన సిగ్నేచర్ సెలబ్రేషన్స్‌తో చర్చల్లో నిలిచాడు. గత సీజన్లలో వికెట్ తీసిన ప్రతిసారి ప్రత్యేకంగా సంబరాలు చేసుకోవడం వల్ల పలుమార్లు వివాదాలకు కేంద్రంగా మారిన దిగ్వేశ్, ఈసారి మాత్రం జాగ్రత్తగా ఉంటానని స్పష్టం చేశాడు. ప్రతి వికెట్ తర్వాత తనదైన స్టైల్‌లో సెలబ్రేట్ చేయడం దిగ్వేశ్ ప్రత్యేకత. అయితే అదే సమయంలో ఈ సంబరాలు కొన్నిసార్లు ప్రత్యర్థి ఆటగాళ్లను అవమానించేలా ఉన్నాయని విమర్శలు రావడంతో పాటు జరిమానాలు కూడా ఎదుర్కొన్నాడు. గతంలో అభిషేక్ శర్మతో జరిగిన చిన్న ఘర్షణ కూడా అప్పట్లో పెద్ద చర్చకు దారి తీసింది. తాజాగా తన సెలబ్రేషన్స్‌పై స్పందించిన దిగ్వేశ్, "నేను ఎవరినీ అవమానించాలనే ఉద్దేశంతో ఇలా చేయడం లేదు. ఇది నా స్టైల్ మాత్రమే. బ్యాట్స్‌మన్‌లు సెంచరీ చేసిన తర్వాత ఎలా సంబరాలు చేసుకుంటారో, అలాగే నేను కూడా నా విధంగా ఆనందాన్ని వ్యక్తపరుస్తాను" అని తెలిపారు. అయితే టీమ్ మేనేజ్‌మెంట్, ముఖ్యంగా రిషబ్ పంత్ తనకు ఒక సూచన ఇచ్చినట్లు వెల్లడించాడు. "ఎలాంటి సెలబ్రేషన్స్ చేసినా, నిబంధనలు ఉల్లంఘించకుండా చూసుకోవాలి.. నిషేధం వచ్చేలా చేయకూడదు" అని వారు చెప్పారని, ఇకపై అదే పాటిస్తానని దిగ్వేశ్ చెప్పాడు. గత సీజన్‌లో ఒకే సీజన్‌లో మూడుసార్లు నిబంధనలు ఉల్లంఘించినందుకు అతనిపై జరిమానాలు విధించబడ్డాయి. మొదట 25 శాతం, తర్వాత రెండు సార్లు 50 శాతం చొప్పున ఫైన్ విధించడంతో పాటు ఒక మ్యాచ్ నిషేధం కూడా ఎదుర్కొన్నాడు. అంతేకాకుండా అతడి ఖాతాలో డీమెరిట్ పాయింట్ కూడా చేరింది. ఈ నేపథ్యంలో ఈసారి దిగ్వేశ్ తన సెలబ్రేషన్స్‌ను కంట్రోల్‌లో ఉంచుకుంటూ, జట్టుకు ఉపయోగపడేలా ఆడతాడా అనే అంశం ఆసక్తికరంగా మారింది.

# రాజస్థాన్ టాప్‌లో



**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభంలోనే పాయింట్ల పట్టిక ఆసక్తికరంగా మారింది. చెన్నై సూపర్ కింగ్స్‌పై భారీ విజయంతో రాజస్థాన్ రాయల్స్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. మూడు మ్యాచ్‌లు పూర్తికాకముందే నెట్ రన్ రేట్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. గువాహటిలో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ బౌలర్లు అద్భుతంగా రాణించడంతో చెన్నై జట్టు కేవలం 127 పరుగులకే పరిమితమైంది. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని రాజస్థాన్ కేవలం 12.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఈ భారీ విజయంతో ఆ జట్టుకు నెట్ రన్ రేట్‌లో భారీ లాభం దక్కింది. ఈ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ. కేవలం 15 ఏళ్ల వయసులోనే 15 బంతుల్లో అర్ధశతకం సాధించి సంచలనం సృష్టించాడు. అతని వేగవంతమైన ఇన్నింగ్స్ వల్ల రాజస్థాన్ లక్ష్యాన్ని అత్యంత వేగంగా చేరుకుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రాజస్థాన్ రాయల్స్ +4.171 నెట్ రన్ రేట్‌తో మొదటి స్థానంలో ఉంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు +2.907 రన్ రేట్‌తో రెండో స్థానంలో ఉండగా, ముంబై ఇండియన్స్ +0.687 రన్ రేట్‌తో మూడో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు ఈ ఓటమితో చెన్నై సూపర్ కింగ్స్ తీవ్రంగా నష్టపోయింది. ఆ జట్టు నెట్ రన్ రేట్ -4.171కి పడిపోవడంతో పట్టికలో దిగువ స్థానాలకు చేరింది. ఈ లోటును పూడ్చుకోవాలంటే రాబోయే మ్యాచ్‌ల్లో భారీ విజయాలు సాధించడం తప్పనిసరి. ఇక మంగళవారం ముల్లాన్‌పూర్ వేదికగా పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరగనున్న మ్యాచ్‌పై అభిమానుల దృష్టి నిలిచింది. ఈ మ్యాచ్ ఫలితం పాయింట్ల పట్టికలో మరిన్ని మార్పులకు దారితీయనుంది.

# బాల్ ట్యాంపరింగ్‌కు నిషేధం



**వేద న్యూస్ డెస్క్:**

పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026లో బాల్ ట్యాంపరింగ్ ఘటన కలకలం రేపింది. పాకిస్థాన్ క్రికెటర్ ఫఖర్ జమాన్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించారు. పీఎస్ఎల్ నియమావళిని ఉల్లంఘించినందుకు అతడిపై ఈ చర్యలు తీసుకున్నట్లు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. బంతి ఆకృతిని మార్చేందుకు ప్రయత్నించడం ద్వారా ఆర్టికల్ 2.14ను అతడు ఉల్లంఘించినట్లు గుర్తించారు. మార్చి 29న కరాచీ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లాహోర్ ఖలందర్స్ తరఫున ఆడుతున్న ఫఖర్ జమాన్ ఈ తప్పిదానికి పాల్పడ్డాడు. అతడి ప్రవర్తనను గమనించిన అంపైర్లు వెంటనే స్పందించి, లాహోర్ జట్టుకు 5 పరుగుల పెనాల్టీ విధించారు. అదనంగా బంతిని మార్చి ఆటను కొనసాగించారు. ఈ ఘటనపై ఫీల్డ్ అంపైర్లు షాహిద్ సైకత్, ఫైజల్ ఖాన్ అఫ్రీది, టీవీ అంపైర్ ఆసిఫ్ యాకూబ్, ఫోర్త్ అంపైర్ తారిక్ రషీద్‌లు క్రమశిక్షణ కమిటీకి నివేదిక సమర్పించారు. విచారణ అనంతరం ఫఖర్ జమాన్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఘటన మరోసారి క్రికెట్‌లో క్రమశిక్షణ, నిబంధనల ప్రాముఖ్యతను గుర్తు చేసింది.

# జడేజా ముద్దుతో వైరల్ క్షణం



**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 19వ సీజన్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్ మరియు రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ అనంతరం అభిమానులను ఆకట్టుకున్న ఒక భావోద్వేగ క్షణం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తన పాత జట్టు సీఎస్కేపై ఉన్న ప్రేమను మరోసారి చాటిచెప్పారు. మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రత్యర్థి జట్టు ఆటగాడు ఖలీల్ అహ్మద్‌తో మైదానంలో సరదాగా మాట్లాడుతుండగా, అతను ధరించిన జెర్సీపై ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ లోగోను జడేజా ఆప్యాయంగా ముద్దాడారు. ఈ అరుదైన సన్నివేశం అభిమానుల హృదయాలను గెలుచుకుంది. జడేజా తన కెరీర్‌లో చాలా కాలం సీఎస్కే జట్టుకు కీలక ఆటగాడిగా కొనసాగిన విషయం తెలిసిందే. జట్టు మారినా, సీఎస్కేపై ఆయనకు ఉన్న అనుబంధం తగ్గలేదని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. మైదానంలో ప్రత్యర్థిగా ఆడినా, మనసులో మాత్రం పాత జట్టుపై ప్రేమ అలాగే ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. క్రికెట్ ప్రేమికులు దీన్ని "మ్యాచ్‌లో బెస్ట్ మూమెంట్"గా అభివర్ణిస్తూ షేర్ చేస్తున్నారు. "జెర్సీ మారినా జడేజా మనసు మాత్రం ఎల్లో ఆర్మీదే" అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

# ఐపీఎల్‌లో విషాదం

**వేద న్యూస్ డెస్క్:**




ఐపీఎల్ 2026 సందడి మధ్య విషాద ఘటన చోటుచేసుకుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి కోసం బ్రాడ్‌కాస్ట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బ్రిటన్ పౌరుడు ఇయాన్ విలియమ్స్ లాంగ్‌ఫోర్డ్ ముంబైలోని హోటల్ గదిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది మార్చి 24 నుంచి ముంబైలోని ఓ ప్రముఖ హోటల్‌లో ఉంటున్న ఇయాన్, మార్చి 29న వాంఖడే స్టేడియంలో జరిగిన ముంబై ఇండియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ అనంతరం తన గదికి వెళ్లారు. అయితే మరుసటి రోజు ఉదయం హోటల్ సిబ్బంది పలుమార్లు సంప్రదించినప్పటికీ స్పందన రాకపోవడంతో అనుమానం వచ్చింది. దీంతో సిబ్బంది మాస్టర్ కీతో గది తలుపులు తెరిచి చూడగా, ఆయన అపస్మారక స్థితిలో నేలపై పడి ఉన్నారు. వెంటనే హోటల్ వైద్యుడిని పిలవగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మెరైన్ డ్రైవ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరణానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోంది. హోటల్ గదిలోని ఆధారాలు, సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్న పోలీసులు, ఇది సహజ మరణమా లేక ఇతర కారణాల వల్ల జరిగిందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. విదేశీ పౌరుడు కావడంతో ఈ విషయాన్ని బ్రిటన్ రాయబార కార్యాలయానికి కూడా తెలియజేశారు. ఇయాన్ చివరిసారిగా పనిచేసిన మ్యాచ్‌లో కోల్‌కతా జట్టు భారీ స్కోరు నమోదు చేయగా, ముంబై ఇండియన్స్ ఆ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. స్టేడియంలో అభిమానులు సంబరాల్లో మునిగిపోయిన సమయంలో, తెర వెనుక పనిచేసే సాంకేతిక నిపుణుడు ఇలా మృతి చెందడం క్రికెట్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది.

# రాజకీయ పోస్టులకు కోటి ఫైన్



**వేద న్యూస్ డెస్క్:**

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆటగాళ్లపై కఠిన నియమాలు అమలు చేయడానికి సిద్ధమైంది. ఇకపై సోషల్ మీడియాలో రాజకీయపరమైన పోస్టులు పెడితే కనీసం కోటి రూపాయల జరిమానా విధిస్తామని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణం పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ నసీం షా చేసిన వివాదాస్పద పోస్టే. పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్‌పై సోషల్ మీడియాలో వ్యంగ్య వ్యాఖ్యలు చేసినందుకు అతడిపై సుమారు రూ.2 కోట్ల జరిమానా విధించింది బోర్డు. పాకిస్థాన్ సూపర్ లీగ్ ప్రారంభ మ్యాచ్ సందర్భంగా మరియం నవాజ్ ప్రత్యేక అతిథిగా హాజరైన నేపథ్యంలో, ఆమెకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంపై నసీం షా చేసిన పోస్ట్ తీవ్ర వివాదానికి దారితీసింది. తరువాత ఆ పోస్టును తొలగించి, తన అకౌంట్ హ్యాక్ అయిందని చెప్పినప్పటికీ బోర్డు ఆ వాదనను తిరస్కరించింది. ఈ ఘటనపై విచారణ జరిపిన పీసీబీ క్రమశిక్షణ కమిటీ, సెంట్రల్ కాంట్రాక్ట్ నిబంధనలు మరియు సోషల్ మీడియా మార్గదర్శకాలను అతడు ఉల్లంఘించినట్లు తేల్చింది. దీంతో భారీ జరిమానా విధించింది. నసీం షా బేషరతుగా క్షమాపణ చెప్పినట్లు కూడా వెల్లడించింది.

వేద న్యూస్

బుధవారం ఏప్రిల్ 01, 2026

# మాస్ లుక్ లో ఫరియా అబ్దుల్లా

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో 'చిట్టి'గా పేరు తెచ్చుకున్న ఫరియా అబ్దుల్లా హిట్ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తోంది. 'జాతిరత్నాలు' సినిమాతో మొదటి ప్రయత్నంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఆ తర్వాత వచ్చిన చిత్రాలతో ఆ స్థాయిలో విజయాన్ని కొనసాగించ లేకపోయింది. వరుసగా సినిమాలు చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఆమె కెరీర్ కొంత మందగించింది. తరువాత వచ్చిన 'మత్తు వదలరా 2' సినిమా కొంతవరకు గుర్తింపు తీసుకొచ్చినా, అది పెద్ద హిట్‌గా నిలవలేదు. చివరిగా చేసిన సినిమాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడంతో ఫరియా కొత్త మార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం ఆమె 'భగవంతుడు' అనే సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా టీజర్ ఇటీవల విడుదల కాగా, అందులో ఫరియా పూర్తిగా భిన్నమైన మాస్ లుక్‌లో కనిపించింది. ఇప్పటివరకు క్యూట్, గ్లామర్ పాత్రల్లో కనిపించిన ఆమె, ఈసారి బోల్డ్ మరియు మాస్ టచ్ ఉన్న పాత్రలో కనిపించడం ప్రత్యేకంగా నిలిచింది. ఈ మార్పు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాలో ఫరియా పాత్రకు మంచి ప్రాధాన్యం ఉందని, కథలో కీలకంగా ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. తన ఇమేజ్‌ను మార్చుకోవాలనే ఉద్దేశంతోనే ఈ తరహా పాత్రను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. మాస్ పాత్రలో ఆమె ఎలా మెప్పిస్తుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇక సోషల్ మీడియాలో కూడా ఫరియా అబ్దుల్లా చురుకుగా ఉంటూ తన ఫోటోలు, వీడియోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈసారి కొత్త లుక్, కొత్త పాత్రతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. మొత్తంగా చూస్తే, 'భగవంతుడు' సినిమా ఫరియా అబ్దుల్లా కెరీర్‌కు కీలకంగా మారే అవకాశముంది. ఈ సినిమాతో ఆమె మళ్లీ విజయపథంలోకి వస్తుందా లేదా అన్నది విడుదల తర్వాతే స్పష్టత రానుంది.



# సల్మాన్ వంశీ సినిమాలో నయనతార




**వేద న్యూస్ డెస్క్:**

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రంలో హీరోయిన్‌గా నయనతారను అధికారికంగా ఎంపిక చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇది ఆ సంస్థకు 63వ చిత్రంగా నిలవడం విశేషం. ఈ సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసిన ప్రకటనలో, ఈ భారీ ప్రాజెక్ట్‌లో నయనతారను భాగస్వామ్యం చేయడం గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే హిందీ సినీ రంగంలో అడుగుపెట్టి భారీ విజయాన్ని అందుకున్న నయనతార, ఇప్పుడు సల్మాన్ ఖాన్ సరసన నటించబోతుండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దర్శకుడు వంశీ పైడిపల్లి గతంలో తెరకెక్కించిన సినిమాలు మంచి విజయాలు సాధించిన నేపథ్యంలో, ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. సల్మాన్ ఖాన్, నయనతార, వంశీ పైడిపల్లి కలయికలో రాబోయే ఈ చిత్రం భారీ స్థాయిలో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమా భారతీయ సినీ పరిశ్రమలో మరో భారీ ప్రాజెక్ట్‌గా నిలిచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# బర్త్‌డేకు గ్లింప్స్ లేవు



**వేద న్యూస్ డెస్క్:**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న తాజా చిత్రం ఏఏ22×ఏ6 (వర్కింగ్ టైటిల్)పై వస్తున్న వార్తలు అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న ఈ సినిమా నుంచి స్పెషల్ గ్లింప్స్ వీడియో విడుదల అవుతుందంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ వార్తతో అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అయితే తాజాగా ఈ వార్తలపై క్లారిటీ వచ్చింది. బర్త్‌డే రోజున ఎలాంటి గ్లింప్స్ లేదా వీడియో కంటెంట్ విడుదల చేయడం లేదని తెలుస్తోంది. కేవలం టైటిల్ పోస్టర్‌ను మాత్రమే విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయాన్ని నిర్మాత బన్నీ వాసు ఒక కార్యక్రమంలో వెల్లడించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సినిమా ప్రత్యేకమైన ప్రాజెక్ట్ కావడంతో, తొందరపడి విజువల్ కంటెంట్ విడుదల చేయకుండా ప్లాన్ చేసుకుంటున్నారని తెలుస్తోంది. 'పుష్ప 2' వంటి భారీ విజయానంతరం అల్లు అర్జున్ చేస్తున్న ఈ సినిమా కావడంతో అభిమానుల్లో అంచనాలు ఇప్పటికే ఆకాశాన్నంటాయి. అంతేకాకుండా తమిళ స్టార్ దర్శకుడు అట్లీ దర్శకత్వం వహిస్తుండటం ఈ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ తీసుకొచ్చింది. ఈ కాంబినేషన్‌లో సినిమా రావడం ఇదే మొదటిసారి కావడంతో సినీ ప్రేమికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోంది. నిర్మాత కళానిధి మారన్ ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా దృష్టిని ఆకర్షించే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక సంగీత దర్శకుడిగా సాయి అభ్యాంకర్ పనిచేస్తుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు ఇంకా పూర్తిగా ప్రకటించాల్సి ఉంది. షూటింగ్ ఇప్పటికే ప్రారంభమై వేగంగా కొనసాగుతోందని తెలుస్తోంది. మొత్తానికి బర్త్‌డే సందర్భంగా గ్లింప్స్ రాకపోవడం అభిమానులకు కొంత నిరాశ కలిగించినప్పటికీ, టైటిల్ పోస్టర్ ద్వారా సినిమా గురించి కొత్త అప్‌డేట్ వచ్చే అవకాశముంది. దీంతో అభిమానులు ఆ పోస్టర్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విజయానంతరం అల్లు అర్జున్ చేస్తున్న ఈ సినిమా కావడంతో అభిమానుల్లో అంచనాలు ఇప్పటికే ఆకాశాన్నంటాయి. అంతేకాకుండా తమిళ స్టార్ దర్శకుడు అట్లీ దర్శకత్వం వహిస్తుండటం ఈ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ తీసుకొచ్చింది. ఈ కాంబినేషన్‌లో సినిమా రావడం ఇదే మొదటిసారి కావడంతో సినీ ప్రేమికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోంది. నిర్మాత కళానిధి మారన్ ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా దృష్టిని ఆకర్షించే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక సంగీత దర్శకుడిగా సాయి అభ్యాంకర్ పనిచేస్తుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు ఇంకా పూర్తిగా ప్రకటించాల్సి ఉంది. షూటింగ్ ఇప్పటికే ప్రారంభమై వేగంగా కొనసాగుతోందని తెలుస్తోంది.

# మూడు సినిమాలతో నితిన్

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ హీరో నితిన్ మరోసారి ఫామ్‌లోకి రావాలనే లక్ష్యంతో వరుస ప్రాజెక్టులను లైన్‌లో పెడుతున్నాడు. ఇటీవల వరుసగా వచ్చిన సినిమాలు ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో, ఈసారి పక్కా ప్లానింగ్‌తో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. తన పుట్టినరోజు సందర్భంగా నితిన్ కొత్త సినిమాను అధికారికంగా ప్రకటించాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రొడక్షన్ నంబర్ 43గా తెరకెక్కనుంది. ఈ సినిమాకు దర్శకుడెవరనే విషయంపై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌ను ఓ కొత్త దర్శకుడు తెరకెక్కించనున్నట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. కొత్త కథ, కొత్త టేకింగ్‌తో ఈ సినిమా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఇదే సమయంలో నితిన్ మరో ప్రాజెక్ట్‌కూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. 'ఆయ్' ఫేం అంజి కే మణిపుత్ర దర్శకత్వంలో ఒక సినిమా చేయనున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ప్రకటన ముందే వచ్చినప్పటికీ, షూటింగ్ ఎప్పుడు ప్రారంభమవుతుందనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ చిత్రాన్ని రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిఖితా రెడ్డి నిర్మించనున్నారు. గతంలో నితిన్ నటించిన 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్', 'రాబిన్ హుడ్', 'తమ్ముడు' సినిమాలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. దీంతో సరైన హిట్ కోసం ఆయన చాలా కాలంగా ఎదురుచూస్తున్నాడు. ఈ నేపథ్యంలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రావాలని నిర్ణయించుకున్నాడు. మొత్తానికి కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ, కొత్త దర్శకులతో కలిసి పని చేయడం ద్వారా నితిన్ మరోసారి విజయాల బాట పట్టాలనే ప్రయత్నం చేస్తున్నాడు. మరి ఈ మూడు సినిమాలు ఆయనకు ఎంతవరకు సక్సెస్ తీసుకువస్తాయో చూడాలి.



# గ్లామర్‌తో దివ్య భారతి సందడి

**వేద న్యూస్ డెస్క్:**

ఒకే ఒక్క సినిమాతో ఓవర్ నైట్‌లో గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో దివ్య భారతి ఒకరు. తన అందం, అభినయంతో తక్కువ సమయంలోనే కుర్రకారు లో ప్రత్యేక స్థానం సంపా దించుకున్న ఈ యువ నటి, సోషల్ మీడియా లో మాత్రం ఎప్పటి కప్పుడు ట్రెండ్ అవుతూ ఉంటు ంది. తమిళ చిత్రం బ్యాచిలర్ ద్వారా సినీ రంగం లోకి అడుగు పెట్టిన దివ్య భారతి, ఆ చిత్రంలో బోల్డ్ పాత్రలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్య ంగా రొమాంటిక్ సన్నివేశాల్లో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకు ంది. దీంతో తొలి సినిమాతోనే భారీ క్రేజ్‌ను సొంతం చేసుకుంది. అయితే ఆ తర్వాత వరుస అవకాశాలు వస్తాయని భావించినప్పటికీ, ఆమె కెరీర్ ఆశించినంత వేగంగా ముందు కు సాగలేదు. కొంత గ్యాప్ తర్వాత జీవీ ప్రకాశ్ సరసన 'కింగ్‌స్టన్' అనే సినిమాలో నటించినప్పటికీ, ఆ చిత్రం పెద్దగా విజయం సాధించలేదు. ప్రస్తుతం తెలుగులో కూడా అవకాశాలు అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం సుడిగాలి సుధీర్ హీరోగా తెరకెక్కుతున్న 'గోట్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ చాలా కాలంగా కొనసాగుతుండగా, త్వరలోనే విడుదలవుతుందనే సమాచారం ఉంది. ఈ ప్రాజెక్ట్‌తో తెలుగులో మంచి బ్రేక్ దక్కుతుందనే ఆశలు ఆమెపై ఉన్నాయి. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో దివ్య భారతి గ్లామర్ ఫొటోలు తరచూ వైరల్ అవుతున్నాయి. తన స్టైలిష్ లుక్స్, ఆకట్టుకునే ఫోటోషూట్లతో అభిమానులను అలరిస్తూ వస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెటిజన్లను ఆకట్టుకోవడంతో పాటు, కుర్రకారులో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. మొత్తంగా చూస్తే, సినిమాల్లో సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న దివ్య భారతి, సోషల్ మీడియాలో మాత్రం తన క్రేజ్‌ను కొనసాగిస్తూ ముందుకు సాగుతోంది. రాబోయే సినిమాలతో ఆమె కెరీర్ మళ్లీ ఊపందుకుంటుందా అన్నది చూడాలి.



# 'పెద్ది' రిలీజ్ మళ్లీ వాయిదా?




**వేద న్యూస్ డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'గేమ్ ఛేంజర్' తర్వాత వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మెగా అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. గ్రామీణ క్రీడల నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఇందులో రామ్ చరణ్ మాస్ లుక్‌లో కనిపించనున్నట్లు ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. మొదట ఈ సినిమాను మార్చి 27న, రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయాలని నిర్ణయించారు. కానీ అనివార్య కారణాలతో విడుదలను ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. తాజాగా ఈ సినిమా మరోసారి వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ సినిమా విడుదల తేదీని జూన్ 26గా ప్లాన్ చేస్తున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో 'పెద్ది' మరోసారి వాయిదా పడుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సినిమా షూటింగ్ ఇంకా పూర్తికాకపోవడం ఈ ఆలస్యానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా ఒక ప్రత్యేక గీతంతో పాటు మరో పాట చిత్రీకరణ ఇంకా మిగిలి ఉన్నట్లు సమాచారం. అలాగే ఇటీవల రామ్ చరణ్ కంటికి గాయం కావడం కూడా షూటింగ్ ఆలస్యానికి కారణమైంది. ఈ నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు, ప్రచార కార్యక్రమాలు పూర్తి చేయడానికి మరింత సమయం అవసరమవుతుందని తెలుస్తోంది. 'పెద్ది' విడుదల తేదీ మారితే ఇతర సినిమాలపై కూడా ప్రభావం పడే అవకాశముంది. అఖిల్ అక్కినేని నటిస్తున్న 'లెనిన్' సినిమా జూన్ 26న విడుదలకు సిద్ధంగా ఉంది. అదే సమయంలో 'పెద్ది' వస్తే ఆ సినిమా తేదీ మారే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. చిత్రాల విడుదలలపై కూడా ప్రభావం ఉండొచ్చని భావిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073